# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 79
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
డిసెంబర్ 11, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## గడ్డం కేశవమూర్తికి భారత్ సేవా రత్న అవార్డు

- అభినందించిన వన్నాల వెంకటరమణ





# కాజీపేట స్టేషన్‌కు.. మహర్దశ





కాజీపేట రైల్వే స్టేషన్‌కు మహర్ధశ పట్టనుంది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అదే విధంగా రాష్ట్రంలోని సుమారు 70 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామన్నారు. దాంట్లో కాజీపేట రైల్వే స్టేషన్ కూడా ఉన్నట్లు చెప్పారు. తెలంగాణకు రైల్వే నిధుల కేటాయింపు పెంచినట్లు మంత్రి చెప్పారు. గతంలో తెలంగాణ, ఆంధ్రాకు కలిపి కేవలం రూ.866 కోట్లు ఇవ్వగా ఇప్పుడు ఒక్క తెలంగాణకే రికార్డు స్థాయిలో రూ.5,336 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. యూపీఏ పాలన సమయంలో ఉమ్మడి రాష్ట్రానికి కూడా ఈ స్థాయిలో నిధులు రాలేదన్నారు. కేవలం నిధుల కోసమే విభజన సృష్టించడం సరికాదని మంత్రి తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను డివిజన్‌గా డెవలప్ చేస్తున్నారా అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నను మంత్రి దాటవేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే రీడెవలప్మెంట్ ప్రాజెక్టును మోదీ సర్కారు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా 1,300 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, చెన్నైలోని ఎగ్మోర్ రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ స్కీమ్ కింద డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు.

-వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

- అమృత్ భారత్ పథకంతో అభివృద్ధి
- రాష్ట్రంలో మొత్తం 70 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ
- రికార్డు స్థాయిలో రూ.5,336 కోట్ల కేటాయింపు
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- లోక్‌సభలో మంత్రి ప్రకటన





8లో..

## విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- మంత్రి దనసరి అనసూయ సీతక్క
- అట్టహాసంగా జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం





2లో..

## కాకతీయ విశ్వవిద్యాలయం ర్యాగింగ్, డ్రగ్ ఫ్రీ క్యాంపస్

- కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



8లో..

## మోహన్ బాబుపై కేసు నమోదు చేయాలి

- వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి
- నల్ల బ్యాడ్జిలు, హెల్మెట్లు ధరించి జర్నలిస్టుల నిరసన



## భజరంగ్ దళ్ ర్యాలీ

స్థానిక కీర్తి గార్డెన్ లో జరుగుతున్న త్రిశూల్ దీక్షలో పాల్గొనటానికి కరీమాబాద్ బొమ్మల గుడి నుంచి భజరంగ్ దళ్ ర్యాలీ బయలుదేరింది. ఈ కార్యక్రమంలో గోగికార్ అనిల్ కుమార్, గొడిశాల కార్తీక్, అరవింద్, బైరి అఖిల్, రాఘవ, ప్రతీక్, నిఖిల్, భరత్, బన్నీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, వరంగల్



## సీఎం కప్ క్రీడల్లో పత్తిపాక విద్యార్థుల ప్రతిభ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఉమ్మడి జిల్లాలో 10, 11 తేదీలలో శాయంపేట మండల కేంద్రం జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో సీఎం కప్–2024 ఛాంపియన్ షిప్ పోటీలలో పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ చూపి యోగా పోటీలలో మండల ఛాంపియన్ గెలుచుకొని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. స్థానిక ఎంపీడీవో ఫణి చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో స్థానిక మండల పాఠశాల విద్యార్థులు, యువజనులు కబడ్డీ–ఖోఖో అథ్లెటిక్స్, యోగా పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. యోగా పోటీల్లో పత్తిపాక విద్యార్థులు జి.నవదీప్, సాయి ప్రణయ్, సాల్మన్, జీ వరుణ్, ఎస్ వరుణ్, మండల స్థాయి పోటీలలో ఛాంపియన్లుగా నిలబడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విజయానికి కారణమైన పాఠశాల పీఈటీ బొలిశెట్టి కమలాకర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి మాధవి, ఉపాధ్యాయులు రఘు, సోంబాబు, విజయ్, అనిత, విజయ, కిరణ్మయి అభినందించారు. పీఎస్ హెచ్ఎం శ్రీనివాసు పాఠశాల కాంప్లెక్స్ అన్ని రంగాలలో దూసుకుపోతున్నందుకు ప్రత్యేకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ భిక్షపతి, గ్రామ కార్యదర్శి రాజారాం తదితరులు పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో సీఎం కప్ ఆటల పోటీలను బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంగా ఉంటామని, యువకులు క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి సీఎం కప్ గెలుచుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమైనవని, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ చేతన్ కుమార్ రెడ్డి, ఎంఈఓ హనుమంత రావు, అబ్జర్వర్ దేవరకొండ ప్రభుదాస్, పీడీ ప్రేమనందం, పీఈటీలు శివ, ప్రతిభ రాణి అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలి
- నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్, భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, పి.ప్రావీణ్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీచర్స్ క్లబ్ సేవలు అభినందనీయం

➲ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని చర్లపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ జిల్లా విద్యాశాఖఅధికారి ఏ.రవీందర్ రెడ్డి చేతులమీదుగా టీచర్స్ క్లబ్, తొర్రూర్ టీచర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ అధ్యక్షతన బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహబూబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తొర్రూర్ టీచర్స్ క్లబ్ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకై పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ సూరం ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ మాట్లాడుతూ టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం టీచర్స్ క్లబ్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందజేస్తుందని, విద్యార్థులు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ ఎఫ్ డబ్ల్యూసీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వేలూరి శారద మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధన కోసం విలువైన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తొర్రూరు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య, జోన్ చైర్ పర్సన్ రేగూరి శ్రీదేవి, క్లబ్ కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ రాయిపెల్లి యాకయ్య, టీచర్స్ క్లబ్ ప్రతినిధులు తోట రమేష్, ఉపాధ్యాయులు జయపాల్ రెడ్డి, యాకూబ్, స్వర్ణలత, కవిత పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయం ర్యాగింగ్, డ్రగ్ ఫ్రీ క్యాంపస్

- కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి
- డ్రగ్స్ కు యువత బానిస కావద్దు
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా






**వరంగల్ వాయిస్, కేయూ :** "కాకతీయ విశ్వవిద్యాలయం ర్యాగింగ్ ఫ్రీ, డ్రగ్ ఫ్రీ క్యాంపస్" అని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్ లాల్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం, స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన "అవేర్నెస్ ప్రోగ్రాం ఆన్ యాంటి–ర్యాగింగ్ అండ్ యాంటి–డ్రగ్ "లో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వల్ప కాలిక ఆనందం కోసం ప్రయత్నించ వద్దన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకం కావాలన్నారు. సంపూర్ణ అబివృద్ధిని, నైపుణ్యాలను కాంక్షించాలని, ఎల్లప్పుడూ అప్రమత్తత, జాగరూకతతో వ్యవహరించాలన్నారు. ర్యాగింగ్, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల రహిత జీవన శైలికి అంబస్డోర్ గా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ఉండాలన్నారు. ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్, పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొనటం ద్వారా వీటికి దూరంగా ఉండగలిగామని అన్నారు. బాధ్యత తో మెలగాలని సూచించారు. అనంతరం ప్రత్యేక అతిదిగా విచేసిన వరంగల్ నగర కమీషనర్ అఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ నూతన విద్యార్థులు కు గౌరవ భావంతో స్వాగతం పలకాలని విద్యార్థులలో కుటుంబ వాతావరణం కలగచేయాలని సూచించారు. డ్రగ్స్ కు బానిస కావద్దు, ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. యాంటి నార్ కోటిక్స్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రవీందర్ డ్రగ్ అబ్యూస్ పై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అతిథులచే డ్రగ్స్ అవగాహన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, ఆచార్య జి.హనుమంతు, ఆచార్య ఈసం నారాయణ, పాలక మండలి సభ్యులు డాక్టర్ ఎన్.సుదర్శన్, కే.అనితా రెడ్డి, స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ సంచాలకులు డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ పాల్గొనగా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ వందనసమర్పణ గావించారు.

# నిజాయితీ చాటుకున్న పంకెర్ల కుమారస్వామి

- దొరికిన పర్స్ ను బాధితురాలికి అప్పగింత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా లేబర్ కమిషనర్ ఆఫీసులో లేబర్ కార్డు తీసుకోవడానికి వచ్చిన కాజీపేట మండలం డిజిల్ కాలనీకి చెందిన ఇప్ప నిర్మల భర్త సమ్మయ్య, లేబర్ ఆఫీస్ మెట్ల ముందు పర్స్ పోగొట్టుకుంది. ఆఫీసులో పని ఉన్నందున అటువైపు నుంచి లోపలికి రాగా బీఎన్ ఆర్ కేవస్, (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంచార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్ కు పర్స్ దొరికింది. దానిని ఏఎల్ఓ, లేబర్ ఆఫీసర్ కు చెప్పగా సీసీ కెమెరాను పరిశీలించి ఆమెను పిలిపించి, పోగొట్టుకున్న పర్స్ ను అందించారు. ఆ పర్స్ లో పాన్, ఏటీఎం, ఆధార్, ఓటరు, ముఖ్యమైన, ఇతర ఐడీ కార్డులతో పాటు రూ.5000 నగదు ఉండగా ఇప్ప నిర్మలకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ చాణక్య మాట్లాడుతూ లేబర్ కార్డు చేయించుకోవడానికి వచ్చి పోగొట్టుకున్న పర్స్ ను తిరిగి ఇప్ప నిర్మలకు నిజాయితీగా ఇవ్వడం పట్ల పంకెర్ల కుమారస్వామి యాదవ్ ను అభినందనించారు. భవన కార్మికులకు గత 25 సంవత్సరాల నుంచి అనేక సేవ కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేస్తున్నారని చెప్పారు. ఇప్ప నిర్మల కూడా పంకెర్ల కుమారస్వామికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ దొంతి సంధ్య, మూల వీర నర్సింహులు, బీఎన్ఆర్కేఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, గూడ వీరస్వామి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కస్తూరి సతీష్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్ష ఎన్నికలు మంగళవారం ఎల్ బీ నగర్ లోని కాస్మో ఫంక్షన్ హాల్ లో హడ్ హక్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్యాలెట్ ద్వారా నిర్వహించారు. అధ్యక్ష పీఠానికి ముగ్గురు సభ్యులు పోటీపడగా ఉదయం 7 గంటల నుండి సాయంత్రం వరకు జరిగిన ఓటింగ్ లో 730 ఓట్లు పోల్ అవడం జరిగింది. ఇందులో కస్తూరి సతీష్ 388, మామిడాల బాలు 240, మేడిపల్లి కర్ణాకర్ 66, ఓట్లు పడగా 148 ఓట్ల ఆధిక్యంతో సమీప ప్రత్యర్థి మామిడాల బాలుపై కస్తూరి సతీష్ విజయం సాధించారు. ఈ ఎన్నికల కార్యక్రమ నిర్వహణ సభ్యులు కొడెపాక రాజేందర్, మేడిపల్లి దశరథం, నాగరాజు, మధు, వేణు తదితరుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రత నడుమ బ్యాలెట్ పత్రాలతో నిర్వహించి గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడిగా కస్తూరి సతీష్ గెలుపొందినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నలుమూలల నుంచి నాయి బ్రాహ్మణ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన క్లాత్ షోరూంను ప్రారంభించిన ఏసీపీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలో బాంబే క్లాత్ షో రూమ్ ను పరకాల ఏసీపీ చిర్రా సతీష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లాత్ స్టోర్ యజమాని మాట్లాడుతూ పరకాల ప్రజలకు సరసమైన ధరలకు కాటన్ షర్టింగ్ క్లాత్ లు అందిస్తున్నామన్నారు. పరకాల సీఐ క్రాంతికుమార్, పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, ఒంటెరు శ్రవణ్, శ్యామ్ ప్రసాద్, నగేష్, దుప్పటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అవినీతి నిరోధక దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేడు వరంగల్ నగరంలోని మాసూం అలీ పాఠశాలలో "అవినీతి నిరోధక దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డుల ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, చిత్ర లేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్య క్రమాన్ని ఉద్దేశించి గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ బీవీఎన్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్య దశ నుండే సమాజంలోని అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కమలాకర్ మాట్లాడుతూ అవినీతిపై పోరాటం చేయాలంటే ముఖ్యంగా నాలుగు లక్షణాలు ఉండాలన్నారు. అవి అవగాహన, ధైర్యం, ఆత్మ విశ్వాసం, తెగువ అని అన్నారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ రంయ్యాల శ్రీధరాచార్యులు విద్యార్థులచే చేయించిన నినాదాలు అందరిని ఆకట్టుకున్నాయి. "లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండు నేరమే", "క్యాన్సర్ కంటే భయంకరమైన జబ్బు" అని ఇటువంటి నినాదాలు చేయించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, భిక్షపతి, అల్లోజు కిషన్, దేవేందర్, ట్రైనీ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు నిర్మాణ గండం

- చట్ట పరమైన అంశాలను పరిగణించాలని వినతి
- కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ నియోజవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చట్టపరమైన అడ్డంకులు ఉన్నాయని భారతీయ జనతా పార్టీ, తెలంగాణ విమోచన కమిటీ మాజీ రాష్ట్ర కన్వీనర్ కాపరబోయిన సత్యనారాయణ అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 285/1 లో నిర్మాణం చేపట్టేందుకు ఈనెల 8న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇదే భూమి గతంలో ఓ వ్యక్తికి లీజు ఇవ్వడం జరిగిందని, దీనిపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావటంతో సదరు వ్యక్తి రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయించి కేసు వేయగా అది పెండింగ్ లో ఉందని వివరించారు. అయితే అదే భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో అతను తిరిగి హైకోర్టుని ఆశ్రయిస్తున్నాడని తెలిపారు. అంతే కాకుండా స్కూల్ నిర్మాణం జరిగితే ప్రక్కనే గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి, సమీపంలోనే భారీ రైస్ మిల్ ఉండడంతో విద్యార్థులకు శబ్ద, వాయు కాలుష్యం జరుగుతుందని ఈ అంశాలను పరిగణంలోకి తీసుకోవాలన్నారు. వివాదంలో ఉన్న భూమి వల్ల రూ.150 కోట్ల వెచ్చించి నిర్మించే ఇంత భారీ ప్రాజెక్టుకు నిర్మాణ ప్రమాదం ఉందని వివరించారు. డోర్నకల్ మండలంలోని అమ్మపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, వాటి సర్వే నెంబర్లను వివరించారు. కురవి మండలంలో స్కూల్ నిర్మాణం చేపట్టే ముందు చట్టపరమైన అంశాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామంలో నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ను కోరారు.

# శబరి గిరీశుడికి అభిషేకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర జరిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం శబరిగిరీశుడు అయ్యప్ప స్వామికి వినాయకునికి దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గట్టు కిషన్, మార్త సుమన్, గోరంట్ల ప్రశాంత్, భక్తులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, పాలకుర్తి టౌన్ :** పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశానుసారం తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మేడారపు సుధాకర్ తన చిన్న నాటి మిత్రుడి కుటుంబానికి చేయూతనందించాడు. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మృతుడు కన్నెబోయిన (నాంపల్లి) రమేష్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా రమేష్ భార్య అనితను బుధవారం పరామర్శించి 50 కేజీల బియ్యం, ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్మగాని మహేష్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు కామారపు సునీల్, ఆకుల నాగరాజు, గాంధారి శ్రీను,సోషల్ మీడియా మండల ఇంచార్జి గజ్జి జనార్ధన్, జంపాల కృష్ణ, దేశబోయిన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బోరు మోటర్ బిగించిన మాజీ ఎంపీటీసీ



**వరంగల్ వాయిస్, కాటారం :** గత 20 రోజుల నుంచి కాటారం గ్రామ పంచాయతీలోని జక్కుల కాలనీలో బోర్ మోటార్ చెడిపోయి నీరు రాక ఆ వాడ ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో వారు మాజీ ఎంపీటీసీ సభ్యుడు తోట జనార్ధన్ ని కలిసి సమస్యను చెప్పడంతో వారు వెంటనే స్పందించి కొత్త బోరు మోటర్ ఇప్పించి దగ్గర ఉండి బిగించారు. కొత్త మోటర్ బిగించడంతో కాలనీవాసులు జనార్ధన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జాడి మల్లయ్య, రాజు, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట అసెంబ్లీ జనరల్ సెక్రటరిగా భూక్య విజేందర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ అర్బన్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరిగా భూక్య విజేందర్ నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ ఇతర సీనియర్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస, దామెర :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు దామెర మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో దామెర మండలంలోని ఊరుగొండ సీతారాంపురం గ్రామాలకు చెందిన పోలేపాక కొమురయ్య, పెండ్లి సుగుణ అనారోగ్యాలతో మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గ్రామ నాయకులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచులు కునమల్ల రవీందర్, జక్కుల రాణి –రవీందర్, జన్ను స్వప్న–రామచందర్, ఏఎంసీ డైరెక్టర్ సుజాత–రాజు రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు నల్ల సుధాకర్, ఊరుగొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలేపాక భిక్షపతి, నంద్యాల శ్రావణ్ రెడ్డి, పోలెపాక రాజు, బొమ్మినేని మల్లారెడ్డి, తుత్తూరు ముత్తయ్య, గొల్లపల్లి వీరయ్య, దండెబోయిన బాబు అనిల్, మైల పెద్దరాజు, పోలేపాక ప్రశాంత్, పోలేపాక అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియాపై దాడులు సరికాదు

## ములుగులో జర్నలిస్టు సంఘాల నిరసన



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మీడియాపై సినీ నటుడు మోహన్ బాబు దాడిని ఖండిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ హైదరాబాదులో మంగళవారం మంచు మోహన్ బాబు మీడియాపై దాడి చేయడం హేమమైన చర్య అని అన్నారు. తక్షణమే అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మోహన్ బాబు మీడియా ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడుతూ దాడి చేయడం సరికాదని అన్నారు. మీడియాపై దాడులు చేసే వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాలు ఆరోపించాయి. మహమ్మద్ షఫీ అహ్మద్, పిట్టల మధుసూదన్, జంగిలి కోటేశ్వరరావు, గాదం దేవేందర్, జాలిగం శ్రీనివాస్, నర్రా రఘువీర్, ముకులోతు శరత్, మహమ్మద్ జలీల్, మాట్ల సంపత్, తోట అనిల్ కుమార్, ఆలుగొండ రమేష్, నల్లబెల్లి సాంబయ్య, గుగ్గిళ్ల సుజన్, బానోతు వెంకన్న, సంజీవ, పొనుగంటి స్వామి, ఆవుల వెంకన్న, సతీష్, సుమన్, భిక్షపతి, హరీష్, హరినాథ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## దామెర ఎస్సై అశోక్

**వరంగల్ వాయిస్, దామెర:** మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులకు సంబంధించి డిసెంబర్ 14న కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని దామెర ఎస్సై అశోక్ తెలిపారు. మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని




(కాంప్రమైజ్) రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్ లో అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీ చేసుకునే ఇరు వర్గాలు డిసెంబర్ 14 వరకు సంబంధిత పోలీసు స్టేషనికి హాజరైనట్లయితే వారిని కోర్టులో ప్రవేశపెట్టి, ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశం ఉంది. కాబట్టి, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికోసం ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఇద్దరు ఆధార్ కార్డులను తీసుకుని పోలీసు స్టేషన్ కు రావాలని కోరారు.

# చిట్టేటి రాజేందర్ రెడ్డికి భారతసేవా రత్న

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ కమిషన్, సోషల్ జస్టిస్ తెలంగాణ అసోసియేషన్ వారు వివిధ రంగాల్లో ఎనలేని సేవలందిస్తున్నప్రముఖులకు 'భారతసేవా రత్న' అను బిరుదును బహుకరించి శాలువాతో సన్మానించారు. చిట్టేటి రాజేందర్రెడ్డి గత 20 సంవత్సరాలుగా వివిధ విద్యాసంస్థలలో ఎంతో మందికి తన భోదన ద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సేవలందించి, సిటి మహిళా డిగ్రీ కళాశాలను 2019లో స్థాపించిన మొదటి సంవత్సరంలోనే 209 మంది విద్యార్థినులతో అంచెలంచెలుగా ఎదిగి ఎందరో పేద, మధ్య తరగతి విద్యార్థినులకు వారి జీవితాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి జీవితాలలో వెలుగులు నింపారు. మరెందరో బహుళజాతి సంస్థలలో మంచి జీతంతో ఉద్యోగాలు పొందడంలో, మరికొంత మంది కాకతీయ యూనివర్సిటి నుంచి మంచి ర్యాంకులు పొందడంలో చిట్టేటి రాజేందర్ రెడ్డి పాత్ర ఎంతగానో శ్లాఘనీయం. 2023లో కోటా రాజస్థాన్ కు చెందిన వైబ్రెంట్ అకాడమీ సెంటర్ ను దక్షిణ భారతదేశంలో వరంగల్ కు విస్తరింపచేయుటలో చిట్టేటి రాజేందర్ రెడ్డి పాత్ర ఎంతగానో అమోఘం. వరంగల్ లోనే విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ, నీట్ పోటీ పరీక్షలలో మంచి కోచింగ్ ఇవ్వడానికి, కోటా రాజస్థాన్ కు చెందిన అపారమైన అనుభవం,



అంకితభావం ఉన్న ఉపాధ్యాయుల వ్యక్తిగత పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడంలో చిట్టేటి రాజేందర్ రెడ్డి ముఖ్య భూమిక తీసుకున్నారు. ఇలాంటి విద్యాసంస్థలు స్థాపించి ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో, కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టేటి రాజేందర్ రెడ్డి ఎనలేని సేవలను గుర్తించి, హ్యూమన్ రైట్స్ కమిషన్, సోషల్ జస్టిస్ తెలంగాణ అసోసియేషన్ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వారికి "భారతసేవా రత్న" అనే బిరుదుతో పాటుగా మెమెంటో ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రెండు సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం చిట్టేటి రాజేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

# ఎగనామం పెట్టిన రైస్ మిల్లులకు ప్రభుత్వ అధికారులు అండదండలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఎంఆర్ ఎగ్గొట్టిన రైస్ మిల్లర్లకు ప్రభుత్వ అధికారులే అండ దండలు అందిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా లాభాలకు ప్రైవేటు మార్కెట్లో అమ్ముకొని లక్షల రూపాయలు లాభాలు పొందిన రైస్ మిల్లర్లకు జిల్లా అధికారులు వత్తాసు పలకడం, మళ్లీ వారికే ఎక్కువ మొత్తంలో ధాన్యం సేకరణకు అవకాశం ఇవ్వడం, గతంలో పెండింగ్ లో ఉన్న బకాయిల గురించి ప్రస్తావన చేయకపోవడం చూస్తే అధికారుల తీరు స్పష్టమవుతుందన్నారు. వాటిని రికవరీ చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సింది పోయి, గండి కొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులను ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న



**వరంగల్ వాయిస్ డోర్నకల్:** ఉద్యాన పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. బుదవారం ఉద్యానవన అధికారి, మండల ఉద్యాన అధికారులతో కలిసి కురవి, డోర్నకల్, మహబూబాబాద్ మండలాలలో పలు గ్రామాలలో సాగులో ఉన్న పలు ఉద్యాన పంటలు, కూరగాయలు, మామిడి, జామ, బొప్పాయి, ఆయిల్ పామ్ పంటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సాంకేతిక సూచనలు తెలిపారు. సాధారణ పద్ధతిలో టమాటా సాగు చేయడం కన్నా ట్రెల్లిస్ (ఎగబాకించే) పద్ధతిలో సాగు చేయడం వలన మేలైన నాణ్యమైన దిగుబడులతో పాటు ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. మామిడి పూత, పిందె సమయంలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని, పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్, బొప్పాయి పలు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి శాంతి ప్రియ, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి చంద్ర ప్రకాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ కమిషనర్లను నియమించాలి

## ● మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలోని ఆమె కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు సమాచార హక్కు చట్టం– 2005 కమిషనర్లను నియమించాలని బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్–3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అలాగే అతి తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్టీఐ కమిషనర్లను నియమించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30రోజుల్లోగా ఇవ్వవలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్



సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

**మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసెంబ్లీ సమావేశంలో సీతాకాల ఎస్సి వర్గీకరణ బిల్లు పెట్టాలని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడారు. నాడు చంద్రబాబు నాయుడు వర్గీకరణ అమలు చేశారని, ఉన్నత స్థాయిలో ఎదగడానికి అవకాశం వచ్చిందని, మాలలు కోర్టులో కేసు వేయడంతో మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేయాలని కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న నోటిఫికేషన్ ఇస్తుండటంతో మాదిగలు నష్టపోతున్నారని ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ ఇవ్వడం లోనూ సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ కు పంపితే నాడు బీజేపీ తాత్సరం చేసిందని, మాలలు రెండు నాల్కల ధోరణి, మాల మాదిగల మధ్య సీఎం చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. కుల గణన ఆధారంగా మా వాటా ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి 1994 నుంచి నేటి వరకు 30ఏండ్ల నుంచి దళిత హక్కులు దోచుకుంటున్నారని విమర్శించారు. ఒక్క మాదిగకు కూడా సాయం చేయలేదని ఎన్ కౌంటర్, మాదిగ దండోరా నేతలను చీల్చడం చేశారన్నారు. నాపై కక్ష కట్టి అనేక ఇబ్బందులకు గురి చేశారని, బీఆర్ఎస్ రెండో ప్రభుత్వం లోనూ మాదిగ లకు కడియం అన్యాయం చేశాడని వాపోయారు. హెల్త్ యూనివర్సిటీ కోసం చావు నోట్లో తలపెట్టి తీసుకొచ్చానని 10 పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో నమ్మకద్రోహి నమ్మక ద్రోహానికి బ్రాండ్ అంబాసిడర్ కడియం అన్నారు. కడియం నీ పాపాలు కడుక్కోవాలని రేవంత్ రెడ్డి వెంబడి పడి వర్గీకరణ చేయాలన్నారు. కుల వృత్తి చేయడానికి నేను సిద్ధం... నీవు జమ్మిడిక కొట్ట గలవా అని ప్రశ్నించారు. అవకాశ వాదంతో కాంగ్రెస్ లోకి వెళ్లాడని, ఎవరూ ఆపిన వర్గీకరణ ఆపే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ కుమార్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# పేకాటరాయుళ్ల అరెస్ట్

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ హెచ్చరించారు. బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పులి రమేష్ వివరాలను వెల్లడిస్తూ నిన్న సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సై రాజ్ కుమార్ సిబ్బందితో కలిసి దామెర గ్రామ శివారులో సమ్మక్క గద్దెల దగ్గర ఖాళీ స్థలంలో రైడ్ చేయగా ఏడుగురు వ్యక్తులు ఏకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. నేర స్థలంలో నగదు రూ.18,300, ప్లేయింగ్ కార్డ్స్, 6 మొబైల్ ఫోన్స్, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక్క ఆటో ఉండగా వాటిని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన హెడ్ కానిస్టేబుళ్లులు బి.విఠల్ రావు, బుచ్చి లింగం, కానిస్టేబుళ్లు తిరుపతి, రంజిత్, సుమన్, ఎస్ఐ రాజ్ కుమార్ ను సీఐ పులి రమేష్ అభినందించారు.

# కన్నె రాజుకు సేవా భూషణ్ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ ఆధ్వర్యంలో కాకినాడ డి కన్వెన్షన్ హాల్ లో మంగళవారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రక్తదానంపై సేవలందించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు (ఏఆర్) పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి-రమానీల దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) గత 20ఏళ్లుగా స్వయంగా 35 సార్లు రక్తదానం చేశారు. తలసేమియా చిన్నారుల కోసం 63 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారికి 17,665 మందికి ఉచితంగా రక్తం అందించడం, 5 రాష్ట్రాలలో రక్తదాన పై అవగాహన కల్పించడం, దీంతోపాటు అన్నదానం, అవయవదానం, విద్యాదానం, హరితహారం, స్వచ్ఛభారత్, కరోనా (కోవిడ్-19) కష్టకాలంలో ప్లాస్మాదానం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేసి, అవార్డు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన డిస్టిక్ కన్స్యూమర్ కమిషన్ కాకినాడ జడ్జి రఘుపతి వసంత కుమార్, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కాకినాడ విష్ణు రఘువీర్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ (ప్రెసిడెంట్) బొడ్డపాటి దాసు, కర్రి భామి రెడ్డి, స్వామి నాయుడు, తబిత రత్న కుమారి, సత్యనారాయణ చేతుల మీదుగా సేవా భూషణ్ అవార్డు-2024ను అందుకున్నారు. ఈ సందర్భంగా కన్నె రాజు మాట్లాడుతూ ఈ అవార్డ్ రక్తదాతలందరికీ అంకితం చేస్తున్నానని తెలిపారు.







# వరంగల్ కోటలో ఓ భామ అయ్యో రామ సినిమా షూటింగ్

- ఉమ్మడి వరంగల్ జిల్లా లోకల్ ఆర్టిస్టులకు ప్రాధాన్యత
- ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ మేడారపు సుధాకర్

కలర్ ఫోటో ఫేం హీరో సుహాస్, హీరోయిన్ మాళవిక, సహ హీరోయిన్ నయని పావని, కమెడియన్ సాత్విక్ ఆనంద్ లు నటీనటులుగా, హరీష్ నల్ల, ఆనంద్ గాదెగొని నిర్మాతలుగా, రామ్ గోదాల దర్శకత్వంలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా మూవీ ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ మేడారపు సుధాకర్ మాట్లాడుతూ వరంగల్ కోట, ఏకశిల గుట్ట, గుండు చెరువు, పార్కు పరిసరాలలో, వరంగల్, హనుమకొండ, జనగామలోని పలు ప్రాంతాలలో ఈ నెల 8 నుంచి 12 వరకు ఉంటుందని, ఈ సినిమాలో వరంగల్ లోకల్ ఆర్టిస్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, చక్కటి ప్రేమ కథ సినిమా అని అన్నారు.



# సాలేహ మోమినకి డాక్టరేట్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్** : సయ్యద సాలేహ మోమిన "ఎక్స్ట్రాక్షన్, ఐసొలేషన్ అండ్ కారెక్టర్యైజ్షన్ ఆఫ్ బయోఆక్టివ్ కాపౌండ్స్ ఫ్రోమ్ రీజినల్ మెడిసినల్ ప్లాంట్స్ " అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్శిటీ), నుంచి ఫార్మకాగ్నోసిలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఇ.విక్రమ్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ జి.ఆచార్య దామోదర్, ఆచార్య కె.వీరవెంకటయ్య ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (OSD), రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్, ప్రొ.క్రిష్టోఫర్ రూబెన్, రిజిస్ట్రార్, ఆచార్య ఎం. రవీందర్, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్, ఆచార్య ఎం.జగదీశ్వర్, ఫార్మసీ డీన్, ఆచార్య పి.శంకరయ్య, డీన్, అడ్మినిస్ట్రేషన్, ఆచార్య ఎ.రాజు, బోధన, బోధనేతర సిబ్బంది, సహ-పరిశోధకులు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్ఓ), జి.రాంబాబు సాలేహ మోమినని అభినందించారు.



# స్టడీ మెటీరియల్ పంపిణీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరీమాబాద్ లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు చిన్ననాటి ఫ్రెండ్స్ గ్రూప్ వారి ఆర్థిక సహకారంతో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ రామకృష్ణ, ఉపాధ్యాయుడు అశోక్ ప్రోద్బలంతో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 60 సెట్ల ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రామకృష్ణ, ఇంచార్జి హెడ్మాస్టర్ పుట్టా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ ను చక్కగా ఉపయోగించుకొని రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక సంఖ్యలో 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీవాణి, పోగు అశోక్, తిలక్, శైలజ, ప్రగతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, డిసెంబర్ 11, 2024



గడ్డం కేశవమూర్తి




# అవార్డుల ఫంక్షన్ అదరహో..


NATIONAL HUMAN RIGHTS COMMISSION & SOCIAL JUSTICE
राष्ट्रीय मानवाधिकार आयोग और सामाजिक न्याय
This Certificate is Proudly bestowed upon
KUSUMA LINGAMURTHY Garu
who has an wnwavering commitment towards Society and serving in the field of SOCIAL ACTIVIST field for the last 12 years
NHECSJ Awards - 2024 Honours
KUSUMA LINGAMURTHY Garu
with BHARAT SEVA RATNA NATIONAL AWARD - 2024
A Prestigious Conserration his exemplifying,dedicated & Worthy services.
G.SREENIVASA RAO

## • ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం • అంబరాన్నంటిన సంబురాలు



ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ హాలులో మంగళవారం రాత్రి ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం చప్పట్లతో హోరెత్తింది. కాకతీయుల గడ్డ ఓరుగల్లు కేంద్రంలో జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా జరగడం ఇదే ప్రథమం. రంగురంగుల వెలుగులతో ఎంతో సరదాగా సుందరంగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ వ్యాఖ్యాత మోహన్ గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ ఆల్ ఇండియా చైర్మన్ గాజుల శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ నేరెళ్ల శ్రీనివాస్, వై బ్రాండ్ అకాడమీ చైర్మన్ చిట్టి రెడ్డి రాజేందర్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త కాసం నమశ్శివాయ, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు కూరపాటి రమేష్, దోమల మహేశ్వర్, హ్యూమన్ రైట్స్ కమిషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పోరాండ్ల శంకర్, ప్రధాన కార్యదర్శి కందగట్ల రాజు, ఉపాధ్యక్షుడు కూచన వేణు, జిల్లా కోఆర్డినేటర్ వూరుగొండ రమేష్, మహిళా అధ్యక్షురాలు చౌక్కా శైలజ, నారగోని మంజుల, శ్రీ రామోజీ రమ, తెలంగాణ పద్మశాలి సంఘం ప్రముఖులు వడ్నాల నరేందర్, ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన భరతనాట్యం, ఇతర నృత్యాలు అలరించాయి.

### సన్మాన గ్రహీతలు..

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విభిన్న రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 25 మంది ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఎంపిక చేసిన వీరికి 'భారత్ సేవారత్న-2024' అవార్డులను అందజేశారు. వరంగల్ జిల్లాలో పేరెన్నిక కలిగిన ప్రముఖ వైద్యులు కూరపాటి రమేష్, రాధిక, దోమల మహేశ్వర్, శ్రీ కుమార్, శ్రీనివాస్ వర్మ, నరేష్, సోమ శేఖర్, కటకం నరేందర్, వై బ్రాంట్ అకాడమీ చైర్మన్ చిట్టి రెడ్డి రాజేందర్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త భరద్వాజ నాయుడు, ప్రముఖ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, బొల్లారం సదయ్య, విరాట్ సాయి రెడ్డి, వరంగల్ జిల్లా సహకార శాఖ అధికారి మాటేటి నీరజ, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బత్తుల కరుణశ్రీ, ప్రముఖ ఇంజనీర్ సంజయ్ కుమార్, కుసుమ లింగమూర్తి తదితరులను ఘనంగా సత్కరించారు. వీరికి ప్రశంసా పత్రం, మెమొంటో ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, జర్నలిస్టులు సామల సూర్యప్రకాష్, వేముల సదానందం, బొజ్జం చొక్కారావుతో పాటు పుర ప్రముఖులు, సాహితీవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, నేషనల్ వుమెన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ సభ్యులు పాల్గొన్నారు.

### సామాజిక న్యాయం మా నినాదం..



మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం తాము పని చేస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ జాతీయ చైర్మన్ గాజుల శ్రీనివాసరావు తెలిపారు. సేవే పరమావధిగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. మానవ హక్కులను, చట్టాలను ఎవరు ఉల్లంఘించినా తమ పోరాటం ఆగదన్నారు. సుపరిపాలన కోసం, అవినీతిని అంతమొందించడం కోసం, జాడ్యాలను, జాప్యాలను తుద ముట్టించడం కోసం కృషి చేస్తామని ఆయన చెప్పారు. వరంగల్ మహానగరంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.





























## పెళ్లిలో అదిరిపోయే స్టెప్పులు..

అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ జంట ఈ నెల 4న వివాహంతో ఒకటయ్యారు. అన్నపూర్ణ స్టూడియోలో కొద్దిమంది బంధువులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం శోభితకు సంబంధించిన వీడియో నెట్టింట్ వైరల్‌గా మారింది. పెళ్లి కూతురు గెటప్‌లో ఉన్న శోభిత పాటకు స్టెప్పులేసింది. అల్లు అర్జున్ 'సరైనోడు' చిత్రంలోని 'బ్లాక్ బస్టర్' సాంగ్‌కు స్టెప్పులేసింది. ఈ సందర్భంగా శ్రద్ధా నాకు పెళ్లవుతోంది.. నాకు సిగ్గేస్తోందంటూ.. అదే సమయంలో ఈ పాట ప్లే కావడంతో శోభిత స్టెప్పులేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియోను చూసిన పలువురు శోభితను ప్రశంసించారు. పెళ్లిని బాగా ఎంజాయ్ చేశారని.. సంతోషంగా కనిపిస్తున్నారని పలువురు కామెంట్స్ చేయగా.. సింప్లీ సూపర్బ్ డ్యాన్స్ అంటూ మరికొందరు స్పందించారు. సమంతతో నాగ చైతన్య విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత శోభితతో రిలేషన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నారు. పెద్దగా సందడి లేకుండా సింపుల్‌గా పెళ్లి చేసుకున్నారు.




## బన్నీ నా బంగారం : రాజేంద్రప్రసాద్

అల్లు అర్జున్ నటించిన పుష్ప చిత్రంపై నటకిరీటి రాజేంద్రప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. మ్యాగీ దర్శకత్వంలో శ్రీరామ్, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ హరికథ . ఇందులో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అయితే ఈ సిరీస్ ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న నటకిరీటి మాట్లాడుతూ.. కలియుగంలో వస్తున్న కథలు చూస్తున్నారు కదా.. నిన్న కాక మొన్న చూశాం.. వాడెవడో ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే దొంగ (పుష్ప సినిమాలో అల్లు అర్జున్ పాత్ర).. వాడు హీరో.. హీరోల్లో అర్థాలు మారిపోయాయి. అంటూ కామెంట్ చేశాడు. అయితే రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలు పుష్ప 2 ది రూల్ మూవీని ఉద్దేశించి చేసినవే ఈ వ్యాఖ్యలు అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. దీంతో ఈ వివాదం ముదరడంతో తాజాగా క్లారిటీ ఇచ్చాడు. తాను అల్లు అర్జున్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయలేదని తెలిపాడు. అల్లు అర్జున్ నా కొడుకు లాంటి వాడు. అతడిని అలా అంటానా. బన్నీ నువ్వు నా బంగారం లవ్ యూ అంటూ రాజేంద్రప్రసాద్ తెలిపాడు.

## పెళ్లికి సిద్ధమైన సమంత

2025 ప్రేమించే భాగస్వామి అంటూ పోస్టు స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య రెండో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గతవారం శోభితతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో సమంత సైతం మరో పెళ్లికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు సామ్ షేర్ చేసిన ఇన్‌స్టా పోస్ట్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. 2025లో నమ్మకం, ప్రేమను అందించే భాగస్వామిని, పిల్లల్ని కోరుకుంటున్నట్లు ఆ పోస్ట్‌లో ఉంది. వృషభ, కన్య, మకర రాశి వారు 2025లో వీటిని పొందే అవకాశం ఎక్కువగా ఉంది అంటూ సామ్ ఓ పోస్ట్ తన ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఆ పోస్ట్‌లో 2025 ఏడాదిలో ఈ మూడు రాశుల వారికి ఎలా ఉందో తెలియజెప్పే జాబితాను పంచుకుంది. ఈ మూడు రాశుల వారు వచ్చే ఏడాది బిజీబిజీగా గడుపుతారని సామ్ షేర్ చేసిన జాబితాలో ఉంది. అంతేకాదు ఈ రాశుల వారు వృత్తిపరంగా మెరుగుపడతారని, బాగా డబ్బులు సంపాదిస్తారని కూడా ఉంది. ఇంకా నమ్మకం, ప్రేమను అందించే భాగస్వామిని పొందుతారట. పిల్లల్ని కూడా పొందుతారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న లక్ష్యాలను కూడా పూర్తి చేస్తారట. ఆదాయ మార్గాలు పెంచుకోవడం, మరిన్ని అవకాశాలు సొంతం చేసుకుని మానసికంగా, శారీరకంగా బలంగా ఉంటారని అందులో ఉంది. ఇందులో ఉన్నవన్నీ జరగాలని కోరుకుంటున్నట్లు సామ్ ఈ సందర్భంగా తెలిపారు.



## ప్రతి ఇంట్లో సమస్యలు ఉంటాయి



### విషయాన్ని సెన్సేషనల్ చేయకండి అంటూ విష్ణు విజ్ఞప్తి

ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు.. అతడి కుమారుడు మంచు మనోజ్‌ల మధ్య గొడవ జరుగుతున్న విషయం తెలిసిందే. కుటుంబ వివాదం నేపథ్యంలో ప్రస్తుతం మోహన్ బాబు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అయితే ఈ విషయంపై తాజాగా మోహన్ బాబు పెద్ద కొడుకు మంచు విష్ణు స్పందించాడు. ప్రతి ఇంట్లోనూ సమస్యలు ఉంటాయి. ఆ సమస్యలు పరిష్కారం అవ్వాలని పెద్దలు కోరుకుంటారు. ఈ విషయంలో ఎవరో ఒకరు తగ్గుతారు అనేది ఒక హోప్ ఉంది. ఈ విషయంపై మాట్లాడటానికి చాలా ఎమోషనల్ అవుతున్నాను. మా నాన్న ఏదైనా తప్పు చేసి ఉంటే అది మమ్మల్ని విపరీతంగా ప్రేమించడం. నేను మీడియా మిత్రులకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. ఈ విషయాన్ని సెన్సేషన్ చేయకండి. ప్రజల్లో మాకు గుర్తింపు ఉంది. ప్రజల్లోకి తీసుకువెళ్లడం కరెక్టే కానీ కొంతమంది వారి లిమిట్స్ దాటి వ్యవహారిస్తున్నారు. దీని వలన మా అమ్మ ఆస్పత్రిలో చేరింది. ఇంటికి పెద్ద కొడుకుగా నేను చాలా బాధపడుతున్నా. నిన్న జరిగిన ఘర్షణలో మా నాన్నకు కూడా గాయాలు అయ్యాయి.

నేను కన్నప్ప పోస్ట్ ప్రోడక్షన్ వర్క్ కోసం అమెరికాలో ఉన్నప్పుడు ఇంట్లో గొడవ జరుగుతుందని నాకు ఫోన్ వచ్చింది. ఈ విషయం తెలియగానే అన్నీ ఆపుకోని వచ్చేశాను. కుటుంబం ఇంపార్టెంట్. నిన్న మార్నింగ్ ఇక్కడికి వచ్చాను. నేను లేని మూడు నాలుగు రోజుల్లో ఇంత జరిగింది. నిన్న జరిగిన ఘటనలో ఒక రిపోర్టర్‌కు గాయలు అయ్యాయి. ఇది అనుకోకుండా జరిగింది. ఉద్దేశపూర్వకంగా ఎవరిని హర్ట్ చేయాలి అనుకోలేదు దయచేసి మా నాన్నపై దుష్ప్రచారాలు చేయొద్దు అంటూ విష్ణు కోరాడు.



### నాన్న అంటే ఎంతో ఇష్టం మంచు మనోజ్ పోస్టు వైరల్

తాజాగా మీడియాతో మాట్లాడిని మంచు మనోజ్ నాన్న అంటే తనకు ప్రాణం అని. మా నాన్న నాకు ఎప్పటికి దేవుడే అంటూ ఎమోషనల్ అయ్యాడు. అంతేగాకుండా.. మా నాన్నను అన్న విష్ణు.. వినయ్ అనే వ్యక్తి కలిసి ట్రాప్ చేసి.. నా నుంచి అతడిని దూరం చేస్తున్నారని తెలిపాడు. అయితే మోహన్ బాబు ప్రస్తుతం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే.

### మాట్లాడటానికి నేను సిద్ధం

తాజాగా ఈ కేసులో మంచు మనోజ్ రాచకొండ సీపీ ఎదుట విచారణకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో వినయ్ చేసే పనులు తనకు నచ్చడం లేదన్నాడు. నా తల్లి ఆస్పత్రిలో లేదు.. ఇంట్లోనే ఉన్నారు..నా తల్లి ఆస్పత్రిలో ఉన్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కూర్చుని మాట్లాడుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. మిగితా విషయాలు తర్వాత మాట్లాడుతానంటూ చెప్పాడు మనోజ్.



### మోహన్‌బాబు స్థిమితంగా లేరు : ఆస్పత్రి వైద్యులు

మంచు మోహన్ బాబు మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఇవాళ హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. మోహన్ బాబు ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా లేదని తెలిపారు. 'మోహన్ బాబు స్థిమితంగా లేరు. మానసికంగా బాధపడుతున్నారు. ఏం జరుగుతోందో అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. ఆయన ఎడమ కంటి కింద కమిలినట్టు గాయమైంది. కుడివైపు కంటి కింద వాపు గుర్తించాం. ఇవాళ సిటిస్కాన్ చేయబోతున్నాం. ఆయన హైబీపీతో బాధపడుతున్నారు. హార్ట్ రేట్ కూడా ఎక్కువగా ఉంది. మరో రెండు రోజులు ఆయనకు ఆసుపత్రిలో చికిత్స చేయాల్సిన అవసరం ఉంది' అని కాంటినెంటల్ వైద్యులు వెల్లడిరచారు.

# విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- మంత్రి దనసరి అనసూయ సీతక్క
- అట్టహాసంగా జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం




**వరంగల్ వాయిస్, ములుగు :** విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలనీ, ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధన చేసే సందర్భంలో వాస్తవిక దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని బోధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం జాకారంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ములుగు జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్ స్పైర్ ప్రదర్శన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాల నుంచి శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకోవాలని, గతంలో శాస్త్రవేత్తలు అంతా కూడా సమాజాన్ని, ప్రకృతిని పరిశీలించి అనేక రకాల ఆవిష్కరణలు చేయడం జరిగింది. అందులో భాగంగా విమానాన్ని తయారు చేయడం, ఓడలు తయారు చేయడం. ఇవన్నీ కూడా సహజసిద్ధంగా పక్షులు, చేపల జీవన విధానాన్ని అధ్యయనం చేసి ఆవిష్కరణ చేశారన్నారు. నేటి విద్యార్థులు కూడా మన భారతీయ శాస్త్రవేత్తల జీవితాలను, వారి ఆవిష్కరణను ఆదర్శంగా తీసుకొని నిత్యము పరిసరాలను పరిశీలిస్తూ సహజ సిద్ధ పరిస్థితులను గమనిస్తూ తద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకొని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. ములుగు జిల్లాలో కూడా అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా ఉన్నారని, అటువంటి మాణిక్యాలను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైన్సు, గణితములను ఇష్టపడి చదివినవారు తమ సృజనతో నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు త్వరగా పరిష్కారం చూపగలగుతారన్నారు. సమస్యకు పరిష్కారం చూపడం, ఆలోచన చేయడానికి సైన్స్, గణితము ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన జిల్లా వైజ్ఞానిక సదస్సు లో భాగస్వాములైన విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగేలా ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మన జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు. ఈ బాల వైజ్ఞానిక ప్రదర్శన మరియు ఇన్స్పైర్ మనక్ ప్రదర్శనను జిల్లా నలుమూలల నుండి 500 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, మండల విద్యాశాఖ అధికారి సామల శ్రీనివాసులు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఏ వెంకటేశ్వర్లు, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, వివిధ సంఘాల జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# గడ్డం కేశవమూర్తికి భారత్ సేవా రత్న అవార్డు

## అభినందించిన వన్నాల వెంకటరమణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత, వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి-సంధ్యారాణి దంపతులను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, సోషల్ జస్టిస్ సంస్థ భారత్ సేవా రత్న అవార్డు-2024తో సత్కరించారు. న్యూ రాయల్ కన్వెన్షన్ లో వైభవంగా జరిగిన ఈ అవార్డుల ప్రదానం కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సభ్యత్వ నమోదు కార్యక్రమం వరంగల్ జిల్లా ఇంచార్జి డాక్టర్ వన్నాల వెంకటరమణ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ సీఈవో వేమల సదానందం నేతలు అత్యుత్తమ అవార్డు అందుకున్న గడ్డం కేశవమూర్తి-సంధ్యారాణి దంపతులను పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు. గడ్డం కేశవమూర్తి-సంధ్యారాణి భవిష్యత్తులో మరెన్నో అద్భుతమైన అవార్డులు అందుకోవాలని డాక్టర్ వన్నాల వెంకటరమణ, వేముల సదానందం నేతలు ఆకాంక్షించారు.

# మోహన్ బాబుపై కేసు నమోదు చేయాలి




- వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి
- నల్ల బ్యాడ్జిలు, హెల్మెట్లు ధరించి జర్నలిస్టుల నిరసన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మీడియా ప్రతినిధులపై దాడి చేసి విచక్షణా రహితంగా వ్యవహరించిన నటుడు మంచు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న టీవీ-9 జర్నలిస్ట్ రంజిత్, టీవీ-5 కెమెరామెన్ సూర్యం, ఈటీవీ కంట్రిబ్యూటర్ లపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ జర్నలిస్ట్ యూనియన్ల నేతలు, పలువురు జర్నలిస్టులు నల్లబ్యాడ్జిలు, హెల్మెట్లు ధరించి భారీ నిరసనకు దిగారు. కేంద్రం స్పందించి ఆయనకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నటుడు మోహన్ బాబు, ఆయన అనుచరుడి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. మోహన్ బాబును అరెస్టు చేయాలని, ఆయనపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జిలు, తలలకు హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుమాధవ్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు గిడుగు కృష్ణమోహన్, పొగాకుల అశోక్, కేకే, టీయూడ్బ్ల్యుజే-143 వరంగల్ జిల్లా కన్వీనర్ కక్కెర్ల అనిల్ కుమార్ గౌడ్, జర్నలిస్టులు పబ్బు సతీష్, వేణు, తిరుపతి, వెంకటరత్నం, రవిచంద్ర, చేతి శ్రీనివాస్, గొట్టె వెంకన్న, వేణుప్రసాద్,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యాంకుమార్, బొడిగ శ్రీను, సహాయ కార్యదర్శి పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు గుండబోయిన దిలీప్, దొమ్మటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్, బూరం ప్రశాంత్, తోట తిరుమల్, అనిల్, వెంకట్, సిద్ధోజు రాకేష్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యలపై పార్లమెంట్ లో గళమెత్తిన ఎంపీ కావ్య

## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై ప్రశ్న



**వరంగల్ వాయిస్, న్యూ ఢిల్లీ :** లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, బైపాస్ లైన్ అలైన్ మెంట్, ప్లాట్ ఫామ్ ల విస్తరణ తదితర అంశాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సమగ్ర ఇంజిన్, కోచ్, వ్యాగన్ ల ఉత్పత్తి యూనిట్ గా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారా అని ఎంపీ డాక్టర్ కావ్య నేరుగా వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ప్రస్తుతం రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, అన్ని రకాల మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లుగా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. కాజీపేట మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లో సమగ్ర కార్యాచరణతో కూడిన పరిశ్రమను డెవలప్ చేస్తున్నామన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటుపై ఎంపీ వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ గత ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో పోలిస్తే ప్రస్తుతం రూ.5వేల కోట్ల పైచిలుకు నిధులు తెలంగాణ రాష్ట్రానికి రైల్వే పనులకోసం కేటాయించామని, రైల్వే అభివృద్ధి విస్తరణ ప్రస్తుతం సునాయాసంగా జరుగుతున్నందున ఆ అంశం ఆలోచించటం లేదన్నారు. బైపాస్ రైల్వే లైన్ లు వ్యవసాయ రంగ కార్యకలాపాలకు అవరోధంగా నిలుస్తూ రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కావ్య గారు వివరించగా ఈ అంశంలో గౌరవ పార్లమెంట్ సభ్యురాలు చేయబోయే సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. కాజీపేట స్టేషన్ ప్లాట్ ఫామ్ ల విస్తరణ అంశాన్ని ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించగా తాము ఈ విషయంలో జాతీయ కార్యాచరణలో భాగంగా చేపట్టిన అమృత్ తరహా అభివృద్ధిని అమలుపరుస్తున్నామన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com